సాక్షి
శ్రీకాకుళం

మంగళవారం ‌। 11 ‌। మార్చి ‌। 2025



కన్నీరే మిగిలిందిక నేస్తం..

కిడ్నీ బాధితుల కష్టాలు అంతులేనివి. ప్రాణాలతో పాటు ఆస్తులు కూడా హరించుకుపోతున్నాయి.


- 8లో



చెరువు దగ్గరకొస్తే తేల్చుకుందాం

టీడీపీ నాయకురాలిని తోటి నాయకుడు బెదిరించాడు. ఆమె మీడియాను ఆశ్రయించారు.

- 8లో



ఇఫ్తార్	సహర్
మంగళ (సా)	బుధ (ఉ)
6.07	4.51


రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

తుది దశకు ఇంటర్ పరీక్షలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియెట్ (ఐపీఈ మార్చి-2025) పబ్లిక్ పరీక్షలు తుది దశకు చేరుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా 75 కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షల్లో భాగంగా 8వ రోజు సోమవారం సెకెండియర్ విద్యార్థులు సెట్-2 ప్రశ్న పత్రంతో మ్యాథ్స్ 2బి, జువాలజీ, హిస్టరీ-2 తదితర పేపర్లకు పరీక్ష రాశారు. జనరల్, ఒకేషనల్ రెండు విభాగాల్లో కలిపి 17523 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 351 మంది గైర్హాజరయ్యారు. అధికారులు, స్క్వాడ్‌లు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. ఈ సీజన్‌లో మొదటిసారి బ్లాంక్ ఓఎంఆర్ షీట్‌ను ఉపయోగించారు. పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓ విద్యార్థికి బ్లాంక్ ఓంఆర్‌ను వినియోగించినట్టు ఆర్ఐఓ పి.దుర్గారావు ధ్రువీకరించారు. మంగళవారం ప్రథమ సంవత్సరం హెచ్ఈసీ, తదితర గ్రూప్‌ల పరీక్షలు ముగియనున్నాయి.

రెండో రోజూ నిరాశే



అలస్యంగా దర్శనమిచ్చిన సూరీడు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో తొలి సూర్యకిరణాలు స్వామి మూలవిరాట్టును తాకే అద్భుత దృశ్యానికి మరోసారి మబ్బులు అడ్డంకిగా మారాయి. తొలిరోజున కూడా ఇలాగే మబ్బులు అడ్డుగా రావడంతో భక్తులకు నిరాశ మిగల్చగా.. రెండో రోజూ కూడా భక్తులకు అదే పరిస్థితి ఎదురైంది. దీంతో సోమవారం ఉదయం 4 గంటల నుంచి వేచి చూసిన భక్తులకు నిరాశ తప్పలేదు. ఉదయం 6.45 గంటల తర్వాత సూర్య కిరణాలు ఆలయంలోని గోపురం స్థాయికి చేరిపోయాయి. దీంతో మళ్లీ ఈ ఏడాది అక్టోబర్ 1,2 తేదీల్లో ఇలాగే కిరణ దర్శనం ఉంటుందని, అంతవరకు భక్తులకు ఆగాల్సిందేనని ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలియజేశారు.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



కల్యాణ హారతినిస్తున్న అర్చకులు సాందీప్‌శర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణం సోమవారం ఉదయం ఘనంగా జరిగింది. ఫాల్గుణ శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీ ఉషా పద్మిని ఛాయాదేవేరులతో శ్రీవారి కల్యాణ మూర్తులను అనివెట్టి మండపంలో వేంచేసింపజేసి ఆగమశాస్త్ర ప్రకారం కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపించారు. రూ.500 చెల్లించిన భక్తదంపతులు కల్యాణ సేవలో పాల్గొనగా, ఆలయం తరపున స్వామి వారి శేషవస్త్రాలను, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఇప్పిలి సాందీప్‌శర్మ, సూపరింటెండెంట్ కనకరాజు పాల్గొన్నారు.



నరసన్నపేట: పార్టీ కార్యాలయంలో యువత పోరు గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ధర్మాన కృష్ణదాస్ తదితరులు



సోంపేట: యువత పోరు గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ తదితరులు



పాతపట్నం: క్యాంప్ కార్యాలయంలో యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



గర్జిద్దాం రండి

విద్యార్థులకు జరుగుతున్న అన్యాయంపై వైఎస్సార్ సీపీ పోరుబాట పట్టనుంది. యువత పోరు పేరుతో 12న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేయడానికి సిద్ధమైంది. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వానికి చెమటలు పట్టేలా ఈ ఆందోళన నిర్వహించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా కాలయాపన చేస్తున్న సర్కారు మొద్దు నిద్ర వీడేలా నినదించాలని కోరారు. కార్యక్రమానికి శ్రేణులను సమాయత్తం చేస్తూ పార్టీ నేతలు అన్ని నియోజకవర్గాల్లో సోమవారం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థి లోకానికి తోడుగా ఆ రోజు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.



కాశీబుగ్గ: యువత పోరు పోస్టర్ ఆవిష్కరణలో డాక్టర్ సీదిరి అప్పలరాజు



శ్రీకాకుళం రూరల్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న అంధవరపు సూరిబాబు, మెంటాడ స్వరూప్ తదితరులు



రణస్థలం: పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తదితరులు



ఆమదాలవలస: పోస్టర్ ఆవిష్కరిస్తున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ తదితరులు



టెక్కలి: యువత పోరు కార్యక్రమం పోస్టర్‌ను టెక్కలిలో ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, కార్యకర్తలు

ట్రూ అప్ వాత.. బిల్లుల మోత

నవంబర్-24



శ్రీకాకుళంలోని ఓ వినియోగదారుడికి నవంబర్ 2వ తేదీన వచ్చిన విద్యుత్ బిల్లు ఇది. ఈ బిల్లులో ట్రూఅప్ చార్జీలో భాగంగా ఎఫ్‌పీపీసీఏ చార్జీ-2 కింద రూ. 59 వసూలు చేస్తున్నట్టుగా చూపించింది.

డిసెంబర్-24



అదే వినియోగదారుడికి డిసెంబర్ 2వ తేదీన వచ్చిన బిల్లు ఇది. ఈ బిల్లులో ట్రూప్ అప్ చార్జీల్లో భాగంగా ఎఫ్‌పీపీసీఏ చార్జీ కింద రూ.89.32, ఎఫ్‌పీపీసీఏ 2 చార్జీ కింద రూ.52 వసూలు చేస్తున్నట్టు చూపించింది.

జనవరి-25



అదే వినియోగదారుడికి జనవరి 3వ తేదీన వచ్చిన బిల్లు ఇది. ఈ బిల్లులో ట్రూ అప్ చార్జీల్లో భాగంగా ఎఫ్‌పీపీసీఏ చార్జీ కింద రూ.91.20, ఎఫ్‌పీపీసీఏ చార్జీ-2 కింద రూ.58, ఎఫ్‌పీపీసీఏ చార్జీ-3 కింద రూ.57.45 వసూలు చేస్తున్నట్టు చూపించింది.

మార్చి-25



ఆయనకే మార్చి 3వ తేదీన వచ్చిన బిల్లు ఇది. ఈ బిల్లులో ట్రూ అప్ చార్జీల్లో భాగంగా ఎఫ్‌పీపీసీఏ చార్జీ కింద రూ.109.20, ఎఫ్‌పీసీఏ చార్జీ-2 కింద రూ. 49, ఎఫ్‌పీసీసీఏ చార్జీ-3 కింద రూ.76.46వసూలు చేస్తున్నట్టు చూపించింది.



- ప్రజలకు వాత పెడుతున్న చంద్రబాబు
- టారిఫ్, ట్రూ అప్ చార్జీల కింద వినియోగదారులకు మోత
- వేసవిలో మరింత పెరగనున్న చార్జీలు
- విద్యుత్ చార్జీలు పెంచబోమంటూనే దొంగదెబ్బ
- జిల్లాలోని వినియోగదారులపై సంవత్సరానికి రూ. 200కోట్ల మేర భారం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కూటమి ప్రభుత్వం దొంగ దెబ్బ తీస్తోంది. బయటకు వివరాలు తెలియనివ్వకుండా మెల్లగా విద్యుత్ బిల్లుల భారం పెంచుతోంది. సాధారణ విద్యుత్ బిల్లులు పరిశీలిస్తే నవంబర్‌లో ట్రూ అప్ చార్జీల్లో భాగంగా ఒక ఎఫ్‌పీపీసీఏ చార్జీ వేయగా, డిసెంబర్ బిల్లులో ట్రూ అప్ చార్జీల్లో భాగంగా రెండు సార్లు ఎఫ్‌పీపీసీఏ చార్జీలను వేసింది. జనవరి బిల్లులో ట్రూ అప్ చార్జీల్లో భాగంగా మూడు సార్లు ఎఫ్‌పీపీసీఏ చార్జీలను వేసింది. మార్చి బిల్లుకొచ్చేసరికి ట్రూ అప్ చార్జీల్లో మూడు సార్లు ఎఫ్‌పీపీసీఏ చార్జీలు వేయడంతో పాటు ఆ చార్జీలను మరింత పెంచేసింది. ఇప్పుడే ఇలా ఉంటే ముున్ముందు వేసవిలో పరిస్థితి ఎలా ఉంటుందోనని సామాన్యుడు భయపడుతున్నాడు.

పెరిగిన టారిఫ్ చార్జీలు..

- 2024 అక్టోబర్ వరకు 30 యూనిట్ల వరకు యూనిట్‌కి రూ.1.90 ఉండేది.
- 2025 జనవరికి వచ్చేసరికి అదే 30 యూనిట్ల వరకు యూనిట్ విలువ రూ.3.33 అయింది.
- 31యూనిట్ల నుంచి 75యూనిట్ల వరకు యూనిట్ విలువ రూ.3.00ఉండేది. ఇప్పుడా 31యూనిట్ల నుంచి 75 యూనిట్ల వరకు యూనిట్ విలువ రూ.4.00అయింది.
- ఈ లెక్కన చూసుకుంటే 30 యూనిట్ల వరకు రూ.3.33, 75 యూనిట్ల వరకు 4.00 లెక్కిస్తారు. దీన్నిబట్టి యూనిట్ల వినియోగం పెరిగే కొద్దీ యూనిట్ విలువ పెరిగిపోతోంది. వేసవిలో సాధారణంగా వినియోగం పెరుగుతుంది. ఈ లెక్కన బిల్లు కూడా భారీగా పెరగనుంది.

పెంచలేదంటూనే...

ఒక వైపు ఈ ప్రభుత్వం చార్జీలు పెంచలేదని చెబుతోంది. మరి బిల్లులు ఎందుకు పెరుగుతున్నాయని, వివరాల్లో ప్రతి నెలా మార్పులు ఎందుకు వస్తున్నాయో పాలకులే చెప్పాలి. విద్యుత్ చార్జీల భారం వేయబోమని చెప్పి వ్యూహాత్మకంగా విద్యుత్ చార్జీల భారం మోపుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లో మూడు సార్లు చార్జీలను పెంచింది.

నెలకి రూ.10కోట్ల అదనపు భారం

- జిల్లాలో శ్రీకాకుళం, పలాస, టెక్కలి డివిజన్ల పరిధిలో మొత్తం 7,88,078 విద్యుత్ కనెక్షన్లున్నాయి.
- వీటిలో హెచ్‌టీ వినియోగదారులు కేవలం 477 మాత్రమే ఉండగా మిగిలినవారంతా ఎల్‌టీ వినియోగదారులే... చంద్రబాబు వీరందరికీ షాక్ ఇచ్చారు.
- అక్టోబర్‌లో రూ.96.30 కోట్ల మేర డిమాండ్ ఉండగా, ఇప్పుడది రూ.106 కోట్లకు చేరిపోయింది.
- ప్రస్తుతం నెలకి రూ.10 కోట్లకు పైగా అదనపు భారం మోపారు.
- వేసవిలో వినియోగం పెరిగితే ఇది మరింత పెరగనుంది.
- అదే జరిగితే సంవత్సరానికి రూ.200 కోట్లకు పైగా వినియోగదారులకు ఆర్థిక భారం పడనుంది.



టెక్కలిలోని ఎన్టీఆర్ కాలనీలో నివసిస్తున్న ఓ వినియోగదారుడి బిల్లు ఇది. నవంబర్ 3వ వరకు వచ్చిన విద్యుత్ బిల్లులో ట్రూ అప్ చార్జీల్లో భాగంగా ఎఫ్‌పీపీసీఏ చార్జీ-2 కింద రూ. 82 వసూలు చేస్తున్నట్టు చూపించింది.



ఇదే వినియోగదారుడికి డిసెంబర్ 4వ తేదీన వచ్చిన బిల్లు ఇది. ఈ బిల్లులో ట్రూ అప్ చార్జీల్లో భాగంగా ఎఫ్‌పీపీసీ చార్జీ కింద రూ.78.74, ఏఫ్‌పీపీసీఏ-2 చార్జీ కింద రూ. 82 వసూలు చేస్తున్నట్టు చూపించింది.



ఇదే వినియోగదారుడికి జనవరి 4వ తేదీన వచ్చిన బిల్లు ఇది. ఈ బిల్లులో ట్రూ అప్ చార్జీల్లో భాగంగా ఎఫ్‌పీపీసీఏ చార్జీ కింద రూ. 80.40, ఎఫ్‌పీపీసీఏ 2 చార్జీ కింద రూ. 66.40, ఎఫ్‌పీపీసీఏ-3 చార్జీ కింద రూ. 48.41 వసూలు చేసినట్టు చూపించింది.



ఇదే వినియోగదారుడికి మార్చి 3వ తేదీన వచ్చిన విద్యుత్ బిల్లు ఇది. ఈ బిల్లులో ట్రూ అప్ చార్జీల్లో భాగంగా ఎఫ్‌పీపీసీఏ చార్జీ కింద రూ.108.71, ఎఫ్‌పీపీసీఏ చార్జీ-2 కింద రూ.48, ఎఫ్‌పీపీసీఏ చార్జీ-3 కింద రూ. 80.98 వసూలు చేస్తున్నట్టు చూపించింది.

కొనసా..గుతున్న పడిగాపులు

- గ్యాస్ సరఫరా కాక ప్రజల ఇబ్బందులు



గ్యాస్ ఆఫీసు వద్ద పడిగాపులు కాస్తున్న కస్టమర్లు

పొందూరు: స్థానిక ఇండేన్ గ్యాస్ కస్టమర్లకు సోమవారం కూడా పడిగాపులు తప్పలేదు. గత పది రోజులుగా గ్యాస్ సరఫరా కాకపోవడంతో కస్టమర్లకు వంట తిప్పలు తప్పడం లేదు. పొందూరు ఏజెన్సీ బాధ్యతలను రణస్థలం, వజ్రపుకొత్తూరు ఏజెన్సీలకు అప్పగించారు. ఈ మేరకు రణస్థలం ఏజెన్సీ స్పందన సరిగ్గా లేకపోయినప్పటికీ వజ్రపుకొత్తూరు ఏజెన్సీ స్పందించింది. సోమవారం నుంచి గ్యాస్ సరఫరా చేయనున్నట్లు ప్రచారం జరగడంతో పలువురు గ్యాస్ ఆఫీసుకు మధ్యాహ్నం 2 గంటలకు చేరుకున్నారు. గ్యాస్ ఆఫీసుకు వజ్రపుకొత్తూరు సిబ్బంది వచ్చారు. అయితే ఆన్‌లైన్‌లో సమస్య తలెత్తింది. దీంతో సాయంత్రం 6 గంటల వరకు గ్యాస్ కస్టమర్లు ఆఫీసుకు రావడం, వెళ్లడం మాత్రమే జరిగింది. గ్యాస్ ఆఫీసుకు వచ్చిన వారందరికీ మంగళవారం నుంచి గ్యాస్ సరఫరా చేస్తామని చెప్పి పంపించేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి పలువురు ఆటోల్లో సిలిండర్లు తీసుకువచ్చారు. ఆటోలకు ఎక్కువ చార్జీలు చెల్లించి అక్కడే గంటల తరబడి ఉన్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో ఉసూరుమని వెనుదిరిగారు. మంగళవారమైనా గ్యాస్ సరఫరాను కచ్చితంగా చేయాలని ప్రజలు కోరుతున్నారు.





రాజేశ్వరి

రేపు ప్రసవం.. అంతలోనే మరణం

మరో రెండు రోజుల్లో ఆమెకు ప్రసవం. ఆ దంపతుల ఆలోచనలన్నీ పుట్టబోయే బిడ్డపైనే ఉన్నాయి. అంతా సవ్యంగా జరగాలని దేవుళ్లందరికీ మొక్కారు. డాక్టర్లు సోమవారం నుంచే ఆస్పత్రిలో ఉండిపొమ్మన్నారు. కానీ వారి విధిరాత మరోలా ఉంది. వస్తువులన్నీ సర్దుకుని వస్తామని చెప్పి వచ్చేశారు. అదే వారి తప్పైపోయింది. ఇంటికి వెళ్తుంటే బస్సు రూపంలో మృత్యువు ఎదురొచ్చింది. తల్లిని, కడుపులోని బిడ్డను తనతో తీసుకెళ్లిపోయి.. కుటుంబానికి శోకం మిగిల్చింది.



ప్రమాదానికి కారణమైన పల్లెవెలుగు బస్సు

- రోడ్డు ప్రమాదంలో నిండు గర్భిణి మృతి
- స్కూటీని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో దుర్ఘటన
- జిల్లా కేంద్రంలోని డేఅండ్‌నైట్ కూడలి సమీపంలో ప్రమాదం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని డేఅండ్‌నైట్ కూడలి సమీపంలో సోమవారం జరిగిన ప్రమాదంలో యంపాడ రాజేశ్వరి(20) అనే నిండు గర్భిణి దుర్మరణం పాలయ్యారు. మరో 48 గంటల్లో ఆమె ప్రసవానికి సిద్ధమవుతుండగా.. ఈ దుర్ఘటన జరగడంతో కుటుంబం తల్లడిల్లిపోతోంది. స్కూటీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఆమె బస్సు చక్రాల కింద నలిగిపోయి ప్రాణాలు విడిచారు. ఘటనలో ఆమె భర్త దుర్గారావు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ట్రాఫిక్ సీఐ నాగరాజు, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు..



కుమార్తె జ్ఞానేశ్వరి, భర్త దుర్గారావుతో రాజేశ్వరి

ఎచ్చెర్ల మండలం కుంచాల కూర్మయ్యపేటకు చెందిన యంపాడ దుర్గారావు అర్బన్ కాలనీలో తన ఇంటికి సమీపంలోనే టిఫిన్‌షాపు నడుపుతున్నారు. ఆయనకు అదే గ్రామానికి చెందిన రాజేశ్వరితో నాలుగేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఏడాదిన్నర వయసు గల పాప ఉంది. రాజేశ్వరి మళ్లీ గర్భం దాల్చడంతో శ్రీకాకుళం రిమ్స్‌లో తరచూ చూపిస్తున్నారు. ఆ క్రమంలోనే సోమవారం ఉదయం 9:30 గంటలకు దంపతులిద్దరూ స్కూటీపై బయల్దేరారు. రిమ్స్‌లో వైద్యులకు చూపించాక బుధవారం ప్రసవం జరిగే అవకాశం ఉందని, ఇప్పుడు వెళ్తే రావడం కష్టమవుతుంది కాబట్టి సోమవారమే ఇక్కడ ఉండిపోవాలని వైద్యులు సూచించారు. కానీ వస్తువులన్నీ సర్దుకుని వచ్చేస్తామని భార్యాభర్తలు తిరుగు ప్రయాణమయ్యారు.

డేఅండ్‌నైట్ కూడలి సమీపానికి ఉదయం 11.48గంటలకు వారు బండిపై చేరుకున్నారు. కూడలి దాటుకుని బ్రిడ్జి వైపు వెళ్లిన కొద్ది సేపటికే విశాఖ వెళ్తున్న ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు వీరిని దాటుకుంటూ వెళ్లింది. అయితే బస్సు స్కూటీ అద్దాన్ని తాకడంతో.. బండి అదుపు తప్పి దుర్గారావు డివైడర్ వైపు పడిపోయారు. రాజేశ్వరి మాత్రం బస్సు వెనుక చక్రాల కింద పడిపోవడంతో తీవ్ర రక్తస్రావమైంది. ప్రమాదం జరిగినా బస్సు డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోవడం అక్కడి వారిని నిశ్చేష్టులను చేసింది. వెంటనే అక్కడున్న వారి సాయంతో భర్త దుర్గారావు రాజేశ్వరిని ఆటోలో మెడికవర్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. కానీ తీవ్రంగా గాయపడిన ఆమె సాయంత్రం నాలుగు గంటలకు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రమాద దృశ్యాలన్నీ మెడిల్యాబ్ సీసీ కెమెరా ఫుటేజీలో నిక్షిప్తమయ్యాయి. దాని ప్రకారం పోలీసులు బస్సును గుర్తించి డ్రైవర్‌కు ఫోన్ చేసి రమ్మని పిలిచారు. అయితే తనకు ఏం జరిగిందో తెలియదని డ్రైవర్ చెప్పడం గమనార్హం. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మెట్ట సుధాకర్ తెలిపారు.

20 ఏళ్లకే ..

చనిపోయిన రాజేశ్వరి వయసు కేవలం 20 ఏళ్లు. పదహారేళ్లు దాటాక పెళ్లి చేసుకుని 18 ఏళ్లకు తల్లిగా మారిన రాజేశ్వరికి 20 ఏళ్లకే ఆయుష్షు రేఖ ఆగిపోయింది. ఇంత చిన్న వయసులో అది కూడా గర్భిణిగా చనిపోవడంతో ఊరంతా శోకసంద్రమైంది.

పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 12న పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాలని పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. అన్ని నియోజవర్గ కేంద్రాల్లో ఆవిర్భావ దినోత్సవం చేపట్టాలని సూచించారు. సోమవారం నరసన్నపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 12న చేపట్టే కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. పార్టీ కార్యాలయాల వద్ద పార్టీ జెండాలను ఆవిష్కరించి, కేక్ కట్ చేయాలన్నారు.

ప్ర‘జల’ బాధలు తప్పేదెన్నడో..?



మున్సిపల్ కుళాయిలు పనిచేయవు. ట్యాంకర్లు ఎప్పుడు వస్తాయో తెలియదు. రెండు రోజులకు ఒకసారి గానీ ఆ ట్యాంకర్ రాదు. ఏ రాత్రి పూట వస్తే అప్పుడే రోడ్డెక్కి లైను కట్టాలి. వెరసి.. తిమ్మాపురం, జగ్గుశాస్త్రులపేట, పార్వతీశ్వరునిపేట గ్రామాల ప్రజల గొంతెండుతోంది. దాహమో రామచంద్రా అంటున్నా వినేవారు లేరు. పార్వతీశ్వరునిపేటలో తాగు నీటి కోసం రాత్రి పూట కూడా ఇలా జనం పనులు మానుకుని క్యూ కట్టారు. మున్సిపల్ అధికారులు స్పందించాలని కోరుతున్నారు. – ఆమదాలవలస


క్లుప్తంగా

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


కన్నారావు మృతదేహం

హిరమండలం: బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని చెప్పిన భార్య, సమయానికి రాకపోవడంతో మండలంలో ధనుపురం గ్రామ సమీపంలోని తోటలో చెట్టుకు ఉరేసుకొని గొర్లె కన్నారావు (34) అనే వ్యక్తి ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పొందూరుకు చెందిన కన్నారావు దంపతులు ఊరూరా గాడిద పాలు అమ్ముకొని జీవనం సాగిస్తుంటారు. ధనుపురం స్పైసీ దాబా సమీపంలోని ఖాళీ గదుల్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే కొన్నిరోజులుగా దంపతుల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల అతడి భార్య ఆమె చెల్లెలు ఉన్న కవిటి గ్రామానికి వెళ్లింది. ఆదివారం తిరిగి వస్తానని చెప్పి రాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన కన్నారావు చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు తల్లి జి.సీతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎండీ యాసిన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు. మృతుడికి భార్య, ఎనిమిదేళ్ల పాప, ఆరేళ్ల బాబు ఉన్నారు.

కన్నీరే మిగిలిందిక నేస్తం..!



నిత్యం పంటలతో తొణికిసలాడే ఉద్దానం విషాదాలకు నిలయంగా మారింది. ఏ ఇంటి తలుపుతట్టినా కన్నీటిచారలే కనిపిస్తున్నాయి. గుండెలను పిండేసే కిడ్నీ బాధలు అడుగడుగునా తారసపడుతున్నాయి. ఇంటికి పెద్ద దిక్కు కిడ్నీ వ్యాధితో మంచాన పడితే.. ఆ పెద్ద దిక్కును దక్కించుకోవడానికి ఉన్నదంతా అమ్మేసి రోడ్డున పడ్డ కుటుంబాల దర్శనమిస్తున్నాయి. ఎదిగొచ్చిన కన్న కొడుకు కిడ్నీ వ్యాధితో కళ్లెదుటే కూలిపోతుంటే భరించలేని ఆ తల్లిదండ్రులు, భారీగా అప్పులు చేసి ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారు. ఆ కుటుంబాలను ఒకసారి పలకరిస్తే... – ఇచ్ఛాపురం రూరల్

- ఉద్దానంలో కుటుంబాలకు మూత్ర గండాలు
- చితికిపోతున్న బతుకులు
- పట్టించుకోని ప్రభుత్వం

ఇల్లు అమ్మేశాం



భర్తే సర్వస్వంగా భావించి తన ఐదో తనాన్ని కాపాడుకునేందుకు నీడనిచ్చే ఇంటిని అమ్మేసి అతడిని రక్షించుకునే పనిలో పడింది ఈ ఇల్లాలు. ఇచ్ఛాపురం మండలం నీలాపపుట్టుగ గ్రామానికి చెందిన కోనేటి తులసీరావు, దమయంతి దంపతులకు పిల్లలు లేకపోవడంతో ఒకరికొకరు కంటి పాపల్లా బతుకుతున్నారు. విసనకర్రలు తయారు చేస్తూ ఊరూరా తిరిగి అమ్ముతూ, వచ్చే ఆదాయంతో కడుపునింపుకునేవారు. అయితే ఈ దంపతులపై కిడ్నీ భూతం పంజా విసిరింది. ఐదేళ్ల క్రితం కిడ్నీ వ్యాధికి గురైన తులసీరావును రక్షించుకునేందుకు శ్రీకాకుళంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో భర్తను చేర్పించింది. ఖరీదైన వైద్యం కోసం భార్య దమయంతి రెండు ఇళ్లను అమ్మేసింది. 8 నెలలు నుంచి వ్యాధి మరింత తీవ్రరూపం దాల్చడంతో ప్రస్తుతం కవిటిలో డయాలసిస్ చేయిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న అరకొర మందులతో ఇబ్బంది పడుతున్న భర్త బాధను చూడలేక ప్రస్తుతం తాము నివసిస్తున్న ఇంటిని సైతం తాకట్టుపెట్టింది. రోజుకు పది విసనకర్రలు తయారు చేసి అమ్మితే రూ.100లు వస్తుందని, అయితే ఆ డబ్బులు మందులకే సరిపోవడం లేదని వాపోతోంది.

ఉన్నదంతా వైద్యానికే



ఇచ్ఛాపురం మండలం సన్యాసిపుట్టుగ గ్రామానికి చెందిన ఆయన పేరు నందూరి విజయ భూషణ్. ఛండీగఢ్‌లో కూలి పనులు చేసుకొని కుటుంబాన్ని పెంచుకుంటూ వస్తున్న దశలో కిడ్నీ మహమ్మారికి గురయ్యాడు. శ్రీకాకుళంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో ఖరీదైన చికిత్స తీసుకున్నప్పటికీ ఫలితం కనిపించలేదు. రూ.లక్షలు అప్పులు చేసి నెలకు రూ.20 వేలు చొప్పున చెల్లించి ఏడాది పాటు డయాలసిస్ చేయించుకున్నాడు. ప్రస్తుతం కవిటిలో డయాలసిస్ చేయించుకుంటున్నారు. డయాలసిస్‌కు వెళ్లిన ప్రతిసారి కేవలం ఆటో ఖర్చులే రూ.600 వరకు అవుతున్నాయని, ప్రభుత్వం ఇచ్చే పింఛన్ ఆటో ఖర్చులకే అయిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కళ్లముందు అప్పులు కనిపిస్తుంటే తమ కుటుంబ భవిష్యత్తు ఎలా ఉంటుందోననే భయమేస్తోందని విచారం వ్యక్తం చేస్తున్నాడు. మునుపటిలా 108 వాహనం ద్వారా తమను ఆస్పత్రికి తీసుకెళ్లడం, రావడం వంటి సదుపాయాలు కల్పించాలని కోరుతున్నాడు.

నాడు భర్త, కొడుకు - నేడు తల్లి



కిడ్నీ వ్యాధితో మృతి చెందిన కొడుకు చిత్రపటంతో కామాక్షి

కవిటి మండలం బొరివంక గ్రామంలోని హరిజనవాడకు చెందిన ఈమె పేరు బలగ కామాక్షి. భర్త తలయారీగా పనిచేస్తూ పన్నెండేళ్ల కిత్రం మూత్రపిండాల వ్యాధితో మృతి చెందగా, తండ్రి ఉద్యోగాన్ని సంపాదించిన కొడుకు బాలరాజు తల్లితో పాటు భార్య, పిల్లలను సాకుతూ వచ్చాడు. విధి ఆడిన వింత నాటకంలో కొడుకు బాలరాజు సైతం కిడ్నీవ్యాధి బారినపడ్డాడు. కొడుకు వైద్యం కోసం తల్లి అప్పులు చేసినా ఎంతో కాలం బతకలేదు. ఈ పిరిస్థితుల్లో కోడలు పిల్లలను వదిలేసి వెళ్లిపోయింది. దీంతో ఎదిగొచ్చిన పిల్లలను పెంచి పోషించే బాధ్యత కామాక్షిపై పడింది. అప్పులు చేసి పిల్లలకు పెళ్లి చేసిన కామాక్షి, ఇప్పుడు తాను సైతం కిడ్నీ భూతం కబంధ హస్తాల్లో చిక్కుకుంది. నెలకు సుమారు రూ.10 వేలు వరకు వైద్యానికే ఖర్చవుతోందని, ప్రభుత్వం వితంతు పింఛన్ మాత్రమే ఇస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తోంది.



చెరువు దగ్గరకొస్తే తేల్చుకుందాం

- టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సంధ్యా గజపతికి బెదిరింపులు
- బెదిరించింది తోటి టీడీపీ నాయకుడే
- చౌదరి బాబ్జీ అనుచరుడు సంపతిరావు గణపతి బెదిరించారని మీడియాను ఆశ్రయించిన సంధ్యా గజపతి



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : విజయనగరం జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి సంధ్యా గజపతిని తోటి టీడీపీ నాయకుడు, నీటి సంఘం అధ్యక్షుడు, చౌదరి బాబ్జీ అనుచరుడు సంపతిరావు గణపతి ఫోన్ చేసి బెదిరించారు. పల్లవాని చెరువు భూమిని అనుకుని ఆక్రమించారని చెరువుల పరిరక్షణ పేరుతో ఫిర్యాదు చేయడమేంటని గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. 'సత్తా ఉంటే.. చెరువు దగ్గరకొస్తే తేల్చుకుందాం. అది చెరువు అని ఉందా. నీకు జ్ఞానం ఉందా?' అని రాత్రి 9.20గంటల సమయంలో ఫోన్ చేసి ఇష్టారీతిన మాట్లాడారు. దీంతో ఆమె పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.

జిల్లాలోని పలుచోట్ల చెరువులు ఆక్రమణకు గురయ్యాయని, ఆక్రమణలు తొలగించాలని కోరుతూ ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఆ సంఘం ప్రతినిధులు కృష్ణమూర్తినాయుడు, సంధ్యా గజపతి తదితరులు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు, నీటి సంఘం అధ్యక్షుడు సంపతిరావు గణపతి నేరుగా సంధ్యా గజపతికి రాత్రి 9.20గంటల సమయంలో ఫోన్ చేసి బెదిరిస్తూ మాట్లాడారు. డీ పట్టాయే కొన్నానని ఒప్పుకుంటూనే.. 'ఇంకా ఏమీ చెరువులు కన్పించలేదా? బాబ్జీ చెరువును జన్మలో తీయించగలవా? ఊర్లో పెద్ద చెరువు 165ఎకరాలు ఉంటే 60ఎకరాలకు వస్తే అప్పుడెక్కడికి వెళ్లిపోయావు? చెరువులన్నీ తీయడానికి పోటుగెత్తివా...మండలంలో అన్నీ తీయ్...రాష్ట్రంలో ఉన్న చెరువులన్నింటిని తీయ్. అప్పుడు ఇక్కడికి రా...సత్తా ఉంటే చెరువు దగ్గరికి రా..' అని బెదిరించారు. 'రికార్డు చేసుకో... ఎవరికిచ్చినా నష్టం లేదు' అని వార్నింగ్ ఇచ్చారు.

ఫిర్యాదులో పేర్కొన్న చెరువు వివరాలివి

ఎచ్చెర్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 1బీలోని ఎకరా 58సెంట్లు మేర భూమిని 1971లో మొహమ్మద్ ఫజుల్లాత్ అనే వ్యక్తికి డీ పట్టా కింద ఇచ్చారు. అయితే, ఈ భూమిని తర్వాత సంపతిరావు గణపతితో పాటు మరో నలుగురు కొనుగోలు చేశారు. రికార్డుల్లో కూడా అనుభవ స్వభావం కొనుగోలు అని నమోదు చేశారు. దీనిపై ఫిర్యాదులు వెళ్లాయి. సుధాసాగర్ అనే తహసీల్దార్ ఉన్నప్పుడు డీ పట్టా భూమిని కొనుగోలు చేయడం కుదరదని, నిబంధనల ప్రాప్తికి అమ్మకం, కొనుగోలు చేయకూడదని, దీన్ని స్వాధీన పర్చుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని విచారణలో నిగ్గు తేల్చడమే కాకుండా దాన్ని ప్రభుత్వ భూమిగా మార్చేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పల్లవాని చెరువుకు ఆనుకుని ఉన్న ఈ భూమిలో ఉన్న వాటిని తొలగించాలని ఆదేశాలిచ్చారు. అప్పట్లో సదరు ఉత్తర్వుల మేరకు తొలగింపులు జరిగాయి. కానీ మళ్లీ అక్కడే కట్టడాలు జరిగాయి. వాటిని తొలగించాలని కోరుతూ మళ్లీ సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు చేసిన వారిలో సంధ్యా గజపతి కూడా ఉండటంతో ఆమెకు సంపతిరావు గణపతి అనే వ్యక్తి ఫోన్ చేసి బెదిరింపులకు దిగారు. ఈ ఫోన్ సంభాషణను సంధ్యా గజపతి రికార్డు చేశారు. దీన్ని పట్టుకుని పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని సోమవారం రాత్రి మీడియాను ఆశ్రయించి జరిగిందంతా వివరించారు. దీనిపై గణపతిని 'సాక్షి' వివరణ కోరగా.. తాను మాట్లాడానని, తన భూమి విషయంలో ఫిర్యాదులు చేస్తున్నారని, ఆమె రికార్డు చేస్తుందని తెలిసినా కూడా మాట్లాడానని, తానేమీ బెదిరించలేదని, ఆమే తిరిగి బెదిరించిందని తెలిపారు.

నీ వెంటే నేను..


తామాడ గణపతి, భారతమ్మ (ఫైల్)

సోంపేట: రోజుల వ్యవధిలోనే భార్యాభర్తలు కన్నుమూసిన ఘటన మండలంలోని కొర్లాం పంచాయతీ లక్ష్మీపురం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామ మాజీ ఎంపీటీసీ తామాడ గణపతి సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. కాగా ఆయన భార్య తామాడ భారతమ్మ సైతం ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. భార్యభర్తలు ఇరువురూ కాంగ్రెస్ పార్టీలో ఎంపీటీసీలుగా పనిచేశారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీలో కొనసాగుతున్నారు. ఇద్దరూ మృతి చెందడంతో కుటుంబంతో పాటు, గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. జిల్లా పరిషత్ చైర్పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోద తదితరులు సంతాపం తెలియజేశారు.

తప్పిపోయిన బాలుడు తల్లి చెంతకు


బాలుడిని తల్లికి అప్పగిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం తండ్రితో పాటు వెళ్లిన ఒక బాలుడు తప్పిపోయాడు. అయితే మూడు గంటల వ్యవధిలోనే తప్పిపోయిన బాలుడిని రెండో పట్టణ పోలీసులు సాంకేతికత సాయంతో తల్లి చెంతకు చేర్చారు. రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో నగరంలోని సత్యలాడ్జి ఎదురుగా ఉన్న దుకాణం వద్ద బాలుడు ఏడుస్తూ కనిపించడంతో స్థానికులు 112కి కాల్‌చేసి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. స్టేషన్‌కు వెళ్లాక బాబును సీఐ పి.ఈశ్వరరావు వివరాలు అడిగినా చెప్పలేకపోయాడు. దీంతో వెంటనే వెంటనే బాలుడి ఫొటోలు తీసి జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్, స్థానికంగా ఉన్న కొన్ని వాట్సాప్ గ్రూపుల్లో వివరాలతో సహా పంపారు. తన కుమారుడి ఫొటో వాట్సాప్ గ్రూపులో కనిపించడంతో అది చూసిన వాంబేకాలనీకి చెందిన బమ్మిడి రూప సాయంత్రం 5 గంటలకు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. బాబు తన భర్త వెంట నడిచి వెళ్లాడని, ఆ విషయం తన భర్త గమనించకపోవడంతో ఇటువంటి పరిస్థితి ఎదురయ్యిందన్నారు. పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 52 వినతులు


వృద్ధురాలి సమస్యను వింటున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియడంతో జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమానికి 52 వినతులు వచ్చాయి. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించి సకాలంలో సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని తెలియజేశారు. అధికారులకు ఫోన్లు చేసి ఆయా ఫిర్యాదులపై నిర్లక్ష్యం లేకుండా, నిర్ణీత సమయంలో పరిష్కరించి నివేదికను జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని ఆదేశించారు.

హామీలు నెరవేర్చాలి

- కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల నిరసన


నిరసన చేపడుతున్న అంగన్‌వాడీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల ముందు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.కల్యాణి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల ఛలో విజయవాడపై రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధానికి నిరసనగా, 42 రోజుల సమ్మె మినిట్స్ అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద సోమవారం అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ముందుగా వాంబే కాలనీ జంక్షన్ నుంచి ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వం ఇచ్చిన జీవోనే మరలా ఇచ్చి మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచుతూ నిర్ణయం తీసుకుందని గుర్తు చేశారు. శాంతియుతంగా ఛలో విజయవాడకు పిలుపునిస్తే రాష్ట్రవ్యాప్తంగా గృహ నిర్బంధాలు, అరెస్టులు చేయడం సరికాదన్నారు. ఎన్నికల ముందు 42 రోజుల సమ్మె సమయంలో టీడీపీ నాయకులు మద్దతు తెలిపి, అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇచ్చి, ఇప్పుడు కనీసం స్పందించడం లేదని పేర్కొన్నారు. కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ – హెల్పర్స్ యూనియన్ నాయకులు కె.సుజాత, కె.హేమలత, కె.లక్ష్మి, మాధవి, చంద్రమౌళి, పి.భూలక్ష్మి, టి.రాజేశ్వరి, అప్పమ్మ, లలిత, ఇ.అప్పలనర్సమ్మ, కె.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన గంజాయి ముఠా


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట అప్పారావు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరా చౌక్ వద్ద కాశీబుగ్గ పోలీసులకు గంజాయి ముఠా సోమవారం పట్టుబడింది. ఈ మేరకు కాశీబుగ్గ పట్టణ పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ వెంకట అప్పారావు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రంలోని గజపతి జిల్లా హరుపదర్ గ్రామానికి చెందిన అన్నదమ్ములు వినయమిన్ మారీఖి, ఆయుభ మారీఖిలు అన్నారు. వీరికి ఉదయగిరి బ్లాక్‌కు చెందిన మైఖేల్ బదరైతతో పరిచయం ఉంది. మైఖేల్ తమ గ్రామ పరిసర ప్రాంతాల్లో గంజాయి పండిస్తుంటాడు. దీంతో అతడు తన గ్రామానికే చెందిన జాన్, అన్నదమ్ములు వినయమిన్, ఆయుభలకు గంజాయి రవాణా చేస్తే డబ్బులు ఇస్తానని చెప్పాడు. పలాస రైల్వేస్టేషన్‌లో తాను చెప్పిన వ్యక్తికి గంజాయి అప్పగిస్తే కిలోకి రూ.1000లు చొప్పున ఇస్తానని తెలిపాడు. దీంతో వీరు ముగ్గురు ఒక ద్విచక్ర వాహనంపై గంజాయి తీసుకొస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. వీరి ముగ్గురినీ అరెస్టు చేశారు. కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోశాధికారిగా ఎంవీ రమణ


ఎంవీ రమణ

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పీడీ–పీఈటీ అసోసియేషన్ కోశాధికారిగా మొజ్జాడ వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం జరిగిన రాష్ట్ర పీడీ–పీఈటీ సంఘ విస్తృతస్థాయి సమావేశంలో ఈ మేరకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇప్పటివరకు ఈయన రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా సేవలు అందించారు. అలాగే శ్రీకాకుళం జిల్లా పీడీ, పీఈటీ సంఘ అధ్యక్షుడిగా గత పదేళ్ల నుంచి విశేషమైన సేవలు అందిస్తున్నారు. ఈయన నియామకంపై ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ధర్మాన కృష్ణదాస్, ఎం.సాంబమూర్తి, చీఫ్ అడ్వైజర్ పి.సుందరరావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు, గ్రిగ్స్ జోనల్, జిల్లా సంఘ ప్రతినిధులు, పీడీలు హర్షం వ్యక్తం చేశారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశం
- మీకోసంలో 141 వినతుల స్వీకరణ


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు


వినతిపత్రం అందజేస్తున్న చింతాడ రవికుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక(మీకోసం)ను సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, సర్వే అండ్ లాండ్ రికార్డులు, హౌసింగ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, విభిన్న ప్రతిభావంతులు, గ్రామీణాభివృద్ధి, వాటర్ రిసోర్సెస్, స్త్రీ, మహిళా, శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, దేవదాయశాఖ, మైన్స్ అండ్ జియాలజీ శాఖలకు సంబంధించి 141 అర్జీలను స్వీకరించారు. అర్జీలు స్వీకరించిన వారిలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, జెడ్పీ సీఈవో ఎల్ఎన్ వి.శ్రీధర్ రాజ పాల్గొన్నారు.

ఆగడాలు అరికట్టాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆమదాలవలస నియోజకవర్గంలో కూటమి నాయకుల ఆగడాలు అరికట్టాలని ఆ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ కోరారు. ఈ మేరకు మీకోసంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కి వినతిపత్రం అందజేశారు. కూటమి నేతలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమదాలవలస మండలం ముద్దాడపేట, సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం వంటి అధికారిక అనుమతులు ఉన్న ఇసుక రీచ్‌ల నుంచి, అలాగే ఆమదాలవలస మండలం తోటాడ, పొందూరు మండలం బొడ్డేపల్లి, సింగూరు, నెల్లిమెట్ట వంటి అనుమతులు లేని ఇసుక రీచ్‌ల నుంచి ప్రతిరోజూ వందలాది లారీల ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని తెలిపారు. దీనివలన సాగునీటి వనరులకు, పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోందని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రాత్రి వేళల్లో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని తెలిపారు. సీసీ కెమెరాలు పనిచేయకుండా చేస్తున్నారని, అటువంటి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అలాగే పొందూరు మండలం గోకరతపల్లి గ్రామానికి చెందిన వీవోఏను రాజకీయ కక్షతో తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారని, ఆమెను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా పొందూరు మండలం గోకర్ణపల్లి గ్రామంలోని పంతకోనేరు, నూకమ్మ చెరువుల్లో ఆక్రమణల వలన ఆయకట్టు రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలం, చెరువులను కాపాడలని కోరారు. ఈ విషయంలో గతంలోనే ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు.